ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 152 బుధవారం 04, ఫిబ్రవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




# యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్

**హైదరాబాద్ నుంచి రైలు**
**త్వరలోనే ప్రధాని మోదీ భూమి పూజ**
**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రజలు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌తో పాటు కొమురవెల్లి,

..మిగతా 2లో

# 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?

**రెండేళ్లయినా తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో**
**ఉద్యోగాలు భర్తీపై ముఖం చాటేసిన సర్కార్**
**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు క్షమించరు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి

..మిగతా 2లో





## మేడారం జాతర దిగ్విజయం.. దొంగ ప్రచారాలకు తావులేదు..

**వైభవంగా ముగిసిన మేడారం మహాజాతర**
**కోట్లాది భక్తుల రాక..**
**అంచనాలకు మించిన సందడి**
**విష ప్రచారాలపై మండిపడ్డ మంత్రి**
**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్ల విస్తరణ..**
**గోదావరి పుష్కరాలపై సమీక్ష**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో

..మిగతా 3లో

## నేడు కడియం అనర్హతపై విచారణ

**ఉదయం 11 గంటలకు..**
**నోటీస్ జారీ చేసిన అసెంబ్లీ స్పీకర్**
**పిటిషనర్ కేపీ వాదనలను నమోదు చేయనున్న గడ్డం ప్రసాద్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. పార్టీ ఫిరాయింపుల కేసులో అనర్హత పిటిషన్ పై విచారణకు రావాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చారు.బీఆర్ఎస్ పార్టీ

..మిగతా 2లో



## కేంద్ర బడ్జెట్ నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అవసరం

**రాష్ట్రానికి రావాల్సిన నిధులపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి**
**ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు

..మిగతా 2లో



## మణిపూర్ కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్..

**ఏడాది తర్వాత కొత్త సీఎం ఎంపిక**
**బీజేపీ శాసన సభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ సింగ్**
**అల్లర్ల నేపథ్యంలో ఇన్నాళ్లుగా రాష్ట్రపతి పాలన**



**ఇంఫాల్, (ప్రజాస్వరం):**

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు బ్రేక్ పడుతున్నట్టు అక్కడి రాజకీయ పరిస్థితులను చూస్తే అర్థం అవుతున్నది. కొత్త సీఎంగా బీజేపీ నేత యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణం చేయనున్నట్టు సమాచారం. మంగళవారం ఆయన్ను బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీంతో సీఎం ఆయనే అనే

..మిగతా 3లో

# అమరులే జాతిపితలు

**కేసీఆర్ అయితే..నేను కూడా జాతిపితనే**
**తెలంగాణ కోసం పార్టీనే ఎదిరించి... సర్వస్వం కోల్పోయా**
**నల్గొండ పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రాణ త్యాగం చేసిన అమరులే జాతిపితలు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ తెలంగాణ దేవత అని ప్రకటించారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అయితే తానూ జాతిపితనే అన్నారు. తెలంగాణ కోసం సొంత పార్టీని ఎదిరించానని, పదవులకు రాజీనామాలు చేసి సర్వం కోల్పోయా అని గుర్తు చేశారు. మూడు దశాబ్దాల క్రితం సామాన్య రైతు బిడ్డగా మీ ముందుకు

..మిగతా 2లో

## నాడు అరాచకం.. నేడు ఆరాటం

**బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆగమైంది**
**పదేండ్లలో ఒక్కరికి కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు**
**మేం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం**
**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అరాచకం సృష్టించిందని, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం ఆరాటపడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుపేదలకు పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదండ్ల పాలనలో ఒక్కరికి కూడా ఇళ్ల స్థలాల ఇవ్వలేదని, ఎన్నికలు రాగానే

..మిగతా 2లో



## అబద్ధాలు మానుకోవాలి



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం భారత్‌కు ఎంతో మేలు చేస్తుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ప్రతిపక్షాలు దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాహుల్ గాంధీ విమర్శల నేపథ్యంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ ప్రయోజనాల కోసం రాజీ పడకుండా మోదీ కష్టపడుతున్నారని అన్నారు. పార్లమెంట్‌లోనే దీనిపై ప్రకటన

..మిగతా 2లో

**ట్రేడ్ డీల్‌పై లేనిపోనివి చెప్పొద్దు**
**తప్పుడు ప్రచారం చేయొద్దు**
**అమెరికా ఒప్పందంతో ఎంతో మేలు**
**రైతులు, డెయిరీ, ఇతర రంగాలకు లాభం**
**రాహుల్‌కు కేంద్రమంత్రి పీయూష్ కౌంటర్**



# యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్

మొదటిపేజీ తరువాయి

జోగులాంబ కొత్త రైల్వే స్టేషన్లపై కీలక అప్డేట్ వచ్చింది. త్వరలోనే హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ మూడో ఫేజ్ ఫనులకు ప్రధాని మోదీ భూమి పూజ చేయనున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. అలాగే కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లు కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయం పునర్నిర్మాణం తర్వాత ప్రతి నిత్యం వేల సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజధాని హైదరాబాద్ నుంచి కూడా భక్తులు భారీగానే వెళ్తుంటారు. అయితే ప్రస్తుతం బస్సులు, ప్రైవేటు వాహనాల్లో యాదగిరిగుట్టకు వెళ్తుండటంతో డబ్బుతో పాటు, ప్రయాణ సమయం కూడా వృథా అవుతోంది. ఈనేపథ్యంలో నగరం నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ ట్రైన్ నడపాలని ఎప్పట్నుంచో భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ట్రైన్ ప్రాజెక్ట్‌పై తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.

హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట మధ్య నిర్మిస్తున్న ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేస్తారని వెల్లడించారు. భక్తుల విజ్ఞప్తి మేరకు ఘట్కేసర్ నుంచి రాయగిరి స్టేషన్ వరకు ఎంఎంటీఎస్ ట్రైన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ట్రాక్ అందుబాటులోకి వస్తే నగరం నుంచి కేవలం 50 నిమిషాల్లోనే యాదగిరిగుట్ట చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. దాంతో పాటుగా.. తక్కువ ఖర్చు అంటే కేవలం 15 నుంచి 20 రూపాయల టికెట్‌తో జర్నీ చేయొచ్చునని అన్నారు. దీంతో పాటుగా కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లనను సైతం త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఐదు వందే భారత్ ట్రైన్లు, రెండు అమృత్ భారత్ ట్రైన్లకు తెలంగాణకు ఇచ్చిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తాజాగా.. కేంద్ర బడ్జెట్‌లో హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు కూడా ప్రకటించినట్లు తెలిపారు. రూ.5.50 లక్షల కోట్లతో 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు హైదరాబాద్ నుంచి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక మేడారం జాతరకు కేంద్రం ప్రకటించిన నిధులను తెలంగాణకు తీసుకొచ్చే బాధ్యత పూర్తిగా తనదేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉచితాల కోసమే కేంద్ర బడ్జెట్ అన్నట్లుగా ప్రజల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఫైరయ్యారు. ఎన్నికల కోసమే కాకుండా భవిష్యత్ తరాలు బాగుండాలని వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్ ఇది అని వెల్లడించారు. ఇప్పటి వరకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణకు కేంద్రం నుంచి 4.30 లక్షల ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు.

# కేంద్ర బడ్జెట్ నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ అవసరం

బుధవారం సాయంత్రం డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**కేంద్ర ప్రాయోజిత పథకాలపై దృష్టి..**

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి గరిష్ట నిధులు పొందేలా శాఖలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఐదు లక్షల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. ఇందులో దేశ జనాభాలో సుమారు 15శాతం ఉన్న తెలంగాణ రాష్ట్రానికి కనీసం 25 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని స్పష్టం చేశారు.

**ఫార్మా, సెమీకండక్టర్, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం**

కేంద్ర బడ్జెట్‌లో ఔషధ పరిశ్రమ, రంగాభివృద్ధి, అర్ధచాలక (సెమీకండక్టర్) తయారీ, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో ఆయా రంగాల్లో రాష్ట్రానికి ప్రయోజనం చేకూరేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలను అనుసంధానిస్తూ దేవాలయ మార్గం (టెంపుల్ కారిడార్) అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు.

**పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధికి విస్తృత అవకాశం..**

వరంగల్‌లో మామునూరు విమానాశ్రయం అభివృద్ధి నేపథ్యంలో ఈ జిల్లాల్లో పర్యాటక, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు.

**ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు ప్రమాణాలు**

పదహారవ ఆర్థిక సంఘం కింద 2011 జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు ఉంటుందని, అలాగే జనాభా నిర్మాణం, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం వంటి అంశాల ఆధారంగా కూడా నిధులు కేటాయిస్తారని తెలిపారు. ముఖ్యంగా అభివృద్ధి ఆధారిత సూచికల ప్రకారం నిధుల పంపిణీకి ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా మిగిలిపోయిన నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వి. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్యసాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.



# 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి

యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గారి మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ గారి హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో "రిక్రూట్‌మెంట్ జీరో"గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు.

జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు.

తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు.


కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ గారి పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కు లేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు.

ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.



# నేడు కడియం అనర్హతపై విచారణ

మొదటిపేజీ తరువాయి



నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బుధవారం (ఫిబ్రవరి 4న) ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అనర్హత వేటుపై బీఆర్ఎస్ పట్టు**

ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించి. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. రేపటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

**దానం నాగేందర్ అఫిడవిట్..**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వాదించారు. గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని చెబుతూ, చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్..**

అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణ మోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు మాజరు కావాలని ఆదేశించారు.

# అబద్ధాలు మానుకోవాలి

మొదటిపేజీ తరువాయి

చేద్దామని చూస్తే, కాంగ్రెస్ అక్కడ గందరగోళ పరిస్థితులను సృష్టించిందని అన్నారు. అమెరికా ట్రేడ్ డీల్‌లో భారత వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోనాలను ప్రధాని మోదీ పరిరక్షించారని వివరించారు. ట్రంప్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగా మంచి ఒప్పందం కుదిరిందని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై ఆయన ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని అబద్ధాలు మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. అమెరికాతో ఒప్పందం కారణంగా రైతులు, డెయిరీ, వ్యవసాయ అనుబంధ రంగాలు లాభపడతాయని తెలిపారు. అన్ని వర్గాలు ట్రేడ్ డీల్‌పై సంతోషం ప్రకటిస్తున్నాయని పీయూష్‌గోయల్ చెప్పారు.







# అమరులే జాతిపితలు

మొదటిపేజీ తరువాయి

వస్తే ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఎంపీని చేశారని, సీనియర్ మంత్రిగా గుర్తింపునిచ్చారని, నల్గొండ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. బుధవారం 14, 15 మర్రిగూడ, చర్లపల్లి డివిజన్ల అభ్యర్థులకు మద్దతుగా చర్లపల్లి బొడ్రాయి చౌరస్త నుంచి ప్రచారం ప్రారంభించారు. 12వ డివిజన్ అభ్యర్థి మామిడి కార్తీక్,27, 28, 29, 26, 30 డివిజన్లకు చెందిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రోడ్ షోతో పాటు ఆయా కాలనీలలో ఓటర్లను అభ్యర్థించారు. ఆయా డివిజన్లకు ప్రచారం నిమిత్తం వెళ్లిన మంత్రికి ఆ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నల్గొండ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే సుమారు రూ.2 వేల కోట్లతో నల్గొండ అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ అనంతరం నల్గొండ కార్పొరేషన్ డెవలప్‌మెంట్‌లో ముందుండే విధంగా ప్రణాళిక ప్రకారం పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మీ నాయకుల ద్వారా మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. నల్గొండ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దనున్నమనిపేర్కొన్నారు. బొట్టు కూడా ప్రభుత్వ పాఠశాల తరహాలోనే నల్గొండ జిల్లా కేంద్రంలోని మిగిలిన ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా ఉద్వేగ భరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాడు అరాచకం.. నేడు ఆరాటం

మొదటిపేజీ తరువాయి

ఓట్ల కోసం హామీల వర్షం కురిపిస్తున్నారని ఫైర్ అయ్యారు. మంగళవారం మంత్రి పొంగులేటి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారన్నారు. ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని మండిపడ్డారు.

**సొంతింటి కలను నెరవేరుస్తాం**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు.ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని సపం చేశారు. ఇప టికే రాపవా పంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడుతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలతో పేదల చెంతకు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నదన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



### మణిపూర్ కొత్త సీఎంగా
# ఖేమ్‌చంద్ సింగ్..

మొదటిపేజీ తరువాయి

అందరూ భావిస్తున్నారు.

**అల్లర్ల నేపథ్యంలో రాష్ట్రపతి పాలన**

2023 మే నెలలో రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం చినికి చినికి పెద్దదై సీఎం రాజీనామాకు దారి తీసింది. ఘర్షణల్లో 250 మందికి పైగా చనిపోయారు. దాంతో 2024 ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది. ఏడాదిగా ఖాళీగా ఉన్న పోస్టులోకి ఖేమ్‌చంద్ సింగ్ రానున్నట్టు సమాచారం. ఉప ముఖ్యమంత్రిగా మహిళా నేత నెమ్చా కిప్‌జెన్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది.

**ఎవరీ ఖేమ్‌చంద్ సింగ్?**

ఖేమ్‌చంద్ సింగ్.. మణిపూర్ బీజేపీలో కీలక నేత 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లో ఉన్న సింగ్జమై నియోజకవర్గం నుంచి గెలిచారు. 2017 నుంచి మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరించారు. 2022 ఎన్నికల్లో బీజేపీ గెలిచన తర్వాత బీరెన్ సింగ్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రి అయ్యారు. 2025 ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలన విధించే వరకు మున్సిపల్, హౌజింగ్ డెవలప్మెంట్, రూరల్ డెవలప్మెంట్, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను చూశారు. మణిపూర్ ప్రస్తుత శాసనసభ పదవీ కాలం 2027 వరకు ఉన్నది.



## కౌజుపిట్టల పెంపకం, చేపల యూనిట్ల పరిశీలన

- **గ్రామీణ ఉపాధి యూనిట్ల అభివృద్ధికి కలెక్టర్ సూచనలు**

దమ్మపేట,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):


దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజుపిట్టల పెంపకం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ అధికారి అమయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు.గుడ్ల ఉత్పత్తి, పిల్లల పొదుగుదల, పెంపకం వంటి విధానాలను కేంద్ర నిర్వాహకులు ప్రసాద్, కృష్ణవేణి దంపతులు వివరించారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటికే జిల్లాలోని పలు మండలాలకు చెందిన ఆసక్తి గల మహిళా సంఘ సభ్యులకు పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి నాబార్డు ద్వారా సహాయం పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువరైతు చాపా బాలకృష్ణ ఏర్పాటు చేసిన కొరమీను చేపల పెంపకం కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయిల్ ఫామ్ తోటలో ఎలాంటి రసాయనాలు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా ఘన, ద్రవ జీవామృతాలతో మంచి దిగుబడి సాధిస్తున్న తీరును అభినందించారు. సమీకృత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.



## అర్థిక సహాయం అందజేత

వలిగొండ,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి బొడ్డుపల్లి యాదయ్య గారు హార్ట్ స్ట్రోక్ తో నిన్న మరణించారు , వారి యొక్కకుటుంబ సభ్యులకి (AJR ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో (5000 వేల రూపాయలు ) అందజేశారు.. గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.



## యాదాద్రి జిల్లాలో పులి అలజడి

వలిగొండ,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

యాదాద్రి భువనగిరి జిల్లాలో పులి సంచారం కలకలం రేపుతోంది. గత పది రోజులుగా 10కి పైగా లేగదూడలను పులి చంపి తిన్నట్లు సమాచారం. తాజాగా, రాజాపేట బసంతపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఉన్న లేగదూడపై పులి దాడి చేసి చంపేసింది. మంగళవారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



# మేడారం జాతర దిగ్విజయం..
# దొంగ ప్రచారాలకు తావులేదు..

మొదటిపేజీ తరువాయి

పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. "క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం" అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు.

జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని



ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. "మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చే వారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు.

ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల



ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

### చత్రపతి విగ్రహావిష్కరణకి 50వేల రూపాయల
## విరాళం అందజేసిన ఏజేఆర్

వలిగొండ,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వెల్వర్తి గ్రామంలో నెలకొల్పనున్న చత్రపతి శివాజీ విగ్రహానికి 50వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వెల్వర్తి శివాజీ యువజన సంఘం సభ్యులు ఎలిమినేటి జంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పల్సం రాజు గౌడ్, చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల కొండల రెడ్డి,మరియు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శక్తిసాయి నగర్‌లో కాంగ్రెస్ బస్తీబాట

కాప్రా,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోనీ శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ (ఫేజ్-1, రాజీవ్ గృహకల్ప)లో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, తాగునీటి సరఫరా లోపాలు, వీధిదీపాల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలోకాంగ్రెస్‌నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.



### వలిగొండ పట్టణంలో స్థానిక వ్యాపారాలను
## కాపాడండి.. వర్తక సంఘం వినతి

వలిగొండ,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

ఇతర రాష్ట్రాల వారి విచ్చలవిడి వ్యాపారాల నుంచి స్థానిక వర్తకులను కాపాడాలని వలిగొండ వర్తక వ్యాపార సంఘం జేఏసీ అధ్యక్షుడు బెలిదే శ్రీను కోరారు. ఆయన ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఇతర ప్రాంతాల వారు వచ్చి కొత్త దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ జీవనాధారాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు.





## మహా పడిపూజతో మార్మోగిన కుమ్మరిగూడ

- **ఓం నమశ్శివాయ నినాదాలతో భక్తిశ్రద్ధల మధ్య శివ స్వాముల పూజ**
- **అన్న వితరణ తో ఘనంగా ముగిసిన మహా శివుని పడిపూజ**

షాబాద్,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కుమ్మరిగూడ గ్రామంలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శివ స్వాముల మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోనమోని శ్రీశైలం, ఉప సర్పంచ్ భరత్, మాజీ సర్పంచ్ కేతన రమేష్, గ్రామ పెద్దలు కొత్తపల్లి వెంకటరెడ్డి, మ్యాగూడెం హనుమంతు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా శివ స్వాముల శివనామ స్మరణతో గ్రామం మార్మోగింది. జనసంద్రంతో నిండిన ఆలయ ప్రాంగణంలో ఓం నమశ్శివాయ నినాదాలు, ఓంకార జపంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శివ స్వాముల పూజలు భక్తులను ఆధ్యాత్మికంగా ఉత్సాహపరిచాయి. అనంతరం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హారతులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు గూళ్ల లక్ష్మీనారాయణ, పెద్దగొల్ల శివానంద స్వామి పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే వార్డు సభ్యులు దేశమల్ల యాదయ్య, మహేందర్, బుక్క రవి తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీశైలం మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను, శాంతి సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.



### బూర్గంపాడు మండల కేంద్రంలో ని బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన బూర్గంపాడు సర్పంచ్

బూర్గంపాడు,ఫిబ్రవరి 03 (ప్రజాస్వరం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపహాడ్ గ్రామ పరిధిలోని సదురు బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, భోజనం, వసతి సదుపాయాలు,గురుంచి తదితర విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆశ్రమ పాఠశాల చుట్టూ ఎటువంటి చెత్త లేకుండా వంటశాలను శుభ్రంగా ఉంచుకుని విద్యార్థులకు మంచి భోజన సదుపాయాలు కల్పించాలని పంచాయతీ సర్పంచ్ మంద నాగరాజు సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండె వెంకన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను

# జయప్రదం చేయాలి

- కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి పిలుపు – సిఐటియు

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 3:(ప్రజాస్వరం):**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సిఐటియు బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు వెంకట్రామయ్య, బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక హక్కులు లేని దేశంగా భారత్‌ను మార్చేందుకు కుట్ర చేస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. కార్మికులను నిరాయుధులను చేసి, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. వీర పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 2019-2020 సంవత్సరాల్లో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని తెలిపారు. కార్మిక వర్గం సాగించిన పోరాటాల ఫలితంగా ఇంతకాలం వాటి అమలును అడ్డుకున్నప్పటికీ, ఇప్పుడు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్ల అమలుకు ముందుకు వచ్చిందని అన్నారు. 2025 నవంబర్ 21న లేబర్ కోడ్ల అమలుకు నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా, 40 కోట్లకు పైగా సంఘటిత, అసంఘటితu కార్మికులు మరియు వారి కుటుంబాలను తీవ్ర అసురక్షిత పరిస్థితుల్లోకి నెట్టిందని విమర్శించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిసే వేళ హడావుడిగా ఈ నిర్ణయం తీసుకోవడం కార్మిక వ్యతిరేక దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచి, విజి-రామ్ జీ స్కీమ్ పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని మోపడం, విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన సవరణ చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి వంటి విధానాలతో శ్రామిక వర్గాలపై ప్రభుత్వం దాడి చేస్తోందని ఆరోపించారు. ఈ చట్టాల వల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. బాచుపల్లి మండలంలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రజా సంఘాలు ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నాగభూషణ్, మండల కమిటీ సభ్యులు ఎల్లమ్మ, నరసింహ, పి. స్వామి మదిలేటి, చెన్నయ్య, లింగమ్మ, నాగలక్ష్మి, నాగ శేషు, భాస్కర్, మనీ, పెంటమ్మ, లక్ష్మి, బాలస్వామితో పాటు ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దృష్టులను కాపాడితే అడ్రస్ గల్లంతే: మందకృష్ణ మాదిగ

**తుంగతుర్తి ఫిబ్రవరి 03(ప్రజాస్వరం):**



కర్ల రాజేష్ మృతికి కారణమైన దోషులను కాపాడితే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల రెండు నియోజకవర్గాల అడ్రస్ గల్లంతు కాక తప్పదని యంఆర్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సభ అధ్యక్షులు చెడుపాక గంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కర్ల రాజేష్ సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు అమాయకుడైన కర్ల రాజేష్ ఎలాంటి తప్పు చేయకుండా, అక్రమ నిర్బంధం చేసి కేసులు నమోదు చేసి పోలీసులు చిత్రహింసలకు గురి చేసి లాకప్ డెత్ కి కారణమైన ఎస్ఐ సురేష్ రెడ్డి ని కాపాడటం వెనుక ఉన్న వాస్తవాలు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఉన్నదని చెప్పారు. రాజేష్ చనిపోయి సుమారు మూడు నెలలు గడుస్తున్నప్పటికి,ఎందుకు నోరు మెదపడం లేదని మండిపడ్డారు.ఆధారాలు లేకుండా పిర్యాదు చేయకుండా అక్రమ నిర్బంధంతో రాజేష్ మృతికి పోలీసులు భాద్యత వహించాల్సి వస్తుందని చాల జగ్రత్తగా పోస్టు మార్టం రిపోర్ట్ను సైతం తమకు అనుకూలంగా మలుచుకునే విదంగా కేసును తప్పుదోవ పట్టించే విధంగా రాష్ట్ర మంత్రి కోదాడ ఎమ్మెల్యే సహకారంతో ఈతంతు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తప్పును ఒప్పుకొని రీ పోస్టుమార్టన్ చేయాలని డిమాండ్ చేశారు. రాజేష్ మృతి ఏరాజకీయ పార్టీలకు పట్టడం లేదని కేవలం మాదిగల ఓట్లు మాత్రమే కావలి మాదిగలు జెండాలు పట్టాలి జై కొట్టాలా అని ఏద్దేవా చేశారు. జాతి కోసం ఎక్కడి దాకానైనా కొట్లడతాం, కానీ ఆత్మ గౌరవం తాకట్టు పెట్టేది లేదన్నారు. అంతకుముందు ప్రజాయుద్ధనౌక ఏపూరి సోమన్న మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన మందకృష్ణ మాదిగ ద్వారానే సాధ్యమైందని, కులం పేరు చెప్పుకోవడానికి ఇబ్బంది పడ్డ మాదిగలు నేడు ప్రతి పేరు చివరన మాదిగ పెట్టుకోవడానికి కారణం కృష్ణన్నని అన్నారు. దళిత జాతిని ఏకం చేసి, చెప్పులు కుట్టిన చేతులతోనే మరోచరిత్ర సృష్టించాడని అన్నారు. దళితులంతా బలిచ్చే మేకలలాగా కాకుండా, గర్జించే సింహం లాగా ఉండాలని అన్నారు. ఆస్తిపాస్తులు లేకున్నా ఆత్మగౌరంతో బతికేవారు మాదిగల అని అన్నారు. పార్టీలకు అతీతంగా సబ్బండ జాతులను కాపాడేది మందకృష్ణ అన్న అని అన్నారు. తన ఆటపాటలతో మాదిగ జాతి ఐక్యం కోసం అనేక సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాటికొండ సీతయ్య, విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు గడ్డం కాశీం, స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, రావులపల్లి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్, తడకమల్ల రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండగడుపుల శ్రీను, మండల ప్రజలు పాల్గొన్నారు.

# డిపోచంపల్లిలో అక్రమ నిర్మాణాల దందా నోటీసులను కూడా లెక్క చేయని నిర్మాణదారుడు

- నోటీసు ఇచ్చారు...రంగులు వేశారు... డిపోచంపల్లిలో అక్రమ నిర్మాణాల రాజ్యం!
- నోటీసులు వచ్చాయి...కానీ అక్రమ నిర్మాణం మరింత ముస్తాబు!

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):**







దుండిగల్ సర్కిల్ పరిధిలోని డిపోచంపల్లి లో అక్రమ నిర్మాణాల పరంపర యథావిధిగా కొనసాగుతోంది. అనుమతులు ఒకలా తీసుకొని నిర్మాణం మాత్రం మరోలా చేసి ఏమాత్రం సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణం చేపడుతున్నారు. మున్సిపల్ నుంచి సర్కిల్ మారినప్పటికీ అక్రమ నిర్మాణాల జోరు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి డిపోచంపల్లి నిలువెత్తు నిదర్శనంగా మారుతోంది. డిపోచంపల్లిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వివిధ వార్తాపత్రికల్లో కథనాలు వెలువడిన నేపథ్యంలో, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక నోటీసు జారీ చేసి తమ బాధ్యత ముగిసినట్టుగా చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నోటీసు ఇచ్చిన తరువాత తదుపరి చర్యలు చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది.
ఇదే సమయంలో నిర్మాణదారుడు మాత్రం "నోటీసులతో మాకు పని లేదు... మా పనులు మేము చేసుకుంటాం" అన్నట్టుగా అధికారులకు బహిరంగ సవాల్ విసురుతూ యధావిధిగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నోటీసుకు ఎలాంటి విలువ ఇవ్వకుండా, రోజువారీ పనులతో పాటు బయట రంగులు కూడా వేస్తూ నిర్మాణాన్ని పూర్తిచేసే ప్రయత్నం జరుగుతోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు జారీ చేసిన నోటీసు కాగితాలకే పరిమితమై, అక్రమ నిర్మాణాలపై సీజ్, కూల్చివేతలు వంటి చర్యలు లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. "అధికారులు కేవలం నోటీసులు ఇచ్చేందుకేనా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని డిపోచంపల్లిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, అక్రమాలకు అధికారిక ముద్ర పడినట్టేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



# మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం.

- ప్రజా సంక్షేమమే గెలుపు మంత్రం.
- చిన్నారెడ్డి, మేఘారెడ్డి, శివసేనారెడ్డి

**వనపర్తి,ఫిబ్రవరి 3 (ప్రజాస్వరం):**

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలే రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందిస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేనారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వనపర్తి, పెబ్బేర్ మునిసిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. మంగళవారం వనపర్తి, పెబ్బేర్ మునిసిపాలిటీలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వనపర్తి మునిసిపాలిటీలోని 33 వార్డులు, పెబ్బేర్ మునిసిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరు గ్యారంటీల అమలుతో పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా, రైతు భరోసా ద్వారా అన్నదాతలకు పెట్టుబడి సహాయం, ఆరోగ్య శ్రీ విస్తరణతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ప్రతిపక్ష పాలనలో నాయకులే బాగుపడ్డారని, సామాన్య ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పథకం నేరుగా అర్హుల ఖాతాల్లోకి చేరుతోందని, మధ్యవర్తులకు చోటు లేకుండా పారదర్శక పాలన కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రజలు ఇప్పుడు మాటలకన్నా పనిని చూస్తున్నారని, అందుకే కాంగ్రెస్‌కు అండగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం వనపర్తి 33వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఎస్ఎల్ఎన్ మాధవి-రమేష్‌లకు బీఫారమ్ అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.





# చెత్త వేస్తే జరిమానా తప్పదు...స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో కఠిన చర్యలు

- ఫుట్‌పాత్, రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా : దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 3(ప్రజాస్వరం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్లో భాగంగా సర్కిల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్ పారిశుధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్పై ప్రజలకు అవగాహన కల్పించారు. డోర్ టు డోర్ ద్వారా సేకరించే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలి అని ప్రజలకు సూచించారు. చెత్త వేరు చేయడం ద్వారా పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉంటుందని ఆయన తెలిపారు. గండి మైసమ్మ ప్రాంతంలో ఫుట్ పాత్‌పై బిల్డింగ్ కన్స్ట్రక్షన్ మెటీరియల్ పోసిన వారిని గుర్తించి రూ.6,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా సర్వే నంబర్ 120 ప్రాంతంలో రోడ్డుపై చెత్త వేసిన వారిపై పెనాల్టీ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా UPHS దొమ్మర పోచంపల్లి పాఠశాలలో విద్యార్థులకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, AEE అశోక్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, జవాన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు అసభ్య వ్యాఖ్యలు గర్హనీయం.

- వనపర్తి జిల్లా కేంద్రంలో టీడీపీ నిరసన

**వనపర్తి,జనవరి 3 (ప్రజాస్వరం):**



తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ సీపీ పార్టీ రాజకీయాలను దిగజారుస్తోందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతోనే వైసిపి నేత అంబటి రాంబాబు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ బి. రాములు మాట్లాడుతూ, అంబటి రాంబాబు నోటికి వచ్చినట్లు మాట్లాడటం ద్వారా తన రాజకీయ అప్రౌఢతను చాటుకున్నారని విమర్శించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ అసభ్య వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్న వైసిపి, దారి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతోందని, అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. లక్ష్మయ్య, హోటల్ బలరాం, చిట్యాల బాలరాజు, జి. చిన్న బాలయ్య, గంధం నాగరాజు, ఆవుల శ్రీను, మేదర్ బాలయ్య, డి. బాలరాజ్, కొత్తగొల్ల శంకర్, కె. గిరి, రాజ మేస్త్రి, అప్పాయిపల్లి బాలయ్యతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# బోర్ వెల్ యజమానుల సమ్మె

- **నిలిచిపోయిన బోర్ వెల్ వాహనాలు**

**మేడ్చల్ (ప్రజాస్వరం) :**

తెలంగాణలోని గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని బోర్ వెల్ వాహనాల నిర్వాహకులు జోనల్ వారీగా సమ్మె కొనసాగిస్తున్నారు . అందులో భాగంగా మేడ్చల్ జోన్ లో కూడా బోర్ వెల్ వాహనాలను ఒకచోట ఆపి సమ్మెను కొనసాగిస్తున్నారు. బోర్ వెల్ యజమానులు మాట్లాడుతూ డ్రిల్లింగ్ బిట్ల ధరలు విపరీతంగా పెరగడంతో యజమానులు లేబర్ లకు పేమెంట్లు కూడా చెల్లించలేక పోతున్నామని వారు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నామని పెరిగిన రేట్లు తగ్గేవరకు సమ్మె కొనసాగిస్తామని యజమానులు తెలిపారు. ఈ సమ్మెలో ఎస్బి బోర్ వెల్ నర్సింగారావు , ధనలక్ష్మి బోర్ వెల్ నాగరాజు, శివగంగ బోర్ వెల్ రామకృష్ణారెడ్డి, సాయి శ్రీనివాస బోర్ వెల్ శ్రీనివాసరెడ్డి, లక్ష్మి బోర్ వెల్స్ నరసింహ, సిద్ది రామేశ్వర బోర్ వెల్ తిరుమలేష్ , జాంగిర్, రాధాకృష్ణ బోర్ వెల్ , శ్రీశైలం, సాయి కృప బోర్ వెల్ మురళి , లింగం, లక్ష్మీ నరసింహ బోర్ వెల్ , నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి

- **వంటేరు ప్రతాప్ రెడ్డి**

**తూప్రాన్, ఫిబ్రవరి 3 (ప్రజా స్వరం) :**



తూప్రాన్ మున్సిపల్ లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు నాయకులు కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి గారు, తూప్రాన్ మున్సిపల్ ఇంచార్జ్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సతీష్ చారి తో కలిసి తూప్రాన్ లో 16 వార్డులకు సంబంధించిన అభ్యర్థుల జాబితా ప్రకటించారు. బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు అందరూ కలిసికట్టుగా పని చేసి తూప్రాన్ మున్సిపల్ పై బిఆర్ఎస్ జండా ఎగిరేలా చొరవ తీసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తూప్రాన్ అభివృద్ధికి పాటుపడిన తీరును, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.


# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 3, (ప్రజాస్వరం) :**

జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బరిగే లక్ష్మి ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు సిద్ధారెడ్డి, వెంకటేష్ కలిసి మృతురాలి కుటుంబానికి 6500/రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ పేదవారికి సహాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈది రెడ్డి, అంజి, రాము, ఆయ్యలం,రమేష్,రాజు ,సురేందర్ రెడ్డి ,నరసింహులు ,రాజు,లక్ష్మారెడ్డి,నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు బి-ఫామ్‌ల పంపిణీ



**పటాన్‌చెరు, ఫిబ్రవరి 03 (ప్రజా స్వరం)**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బిఫామ్‌లను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మరియు మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించి, ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిన్నారం మున్సిపాలిటీలో 20 వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన



**జిన్నారం, ఫిబ్రవరి 03(ప్రజా స్వరం) :**

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మున్సిపాలిటీలో 20 వార్డులకు సంబంధించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ పాల సాయిరాం, ఐలాపూర్ మాణిక్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశం గౌడ్ తదితర నాయకులు పాల్గొని అభ్యర్థులకు పిబీ ఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ అభ్యర్థులను కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, ప్రజల పక్షాన నిలబడింది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. ప్రతి కార్యకర్త గ్రౌండ్ లెవెల్‌లో పనిచేసి ఇంటింటికీ వెళ్లి నిజాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



# ఎల్లంపేట్ చైర్ పర్సన్ పీఠం కాంగ్రెస్‌దే

- **మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**మేడ్చల్,(ప్రజాస్వరం):**

18 వార్డులను గెలిచి ఎల్లంపేట్ మునిసిపల్ ఛైర్పర్సన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, ఎల్లంపేట్ మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మేడ్చల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మలి పెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. 24 వార్డులలో పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి ఫామ్ ఇచ్చి ఎన్నికల బరిలో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో వారి వద్దకు తీసుకెళ్లి ఎన్నికల పోరులో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి పక్క కమర్షియల్ క్యాండేట్ అని, ప్రజాసేవ చేసేందుకు ఆయన రాజకీయాల్లోకి రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో నాలుగు గ్యారెంటీలను ఇప్పటికే విస్తృత స్థాయిలో ఇస్తున్నామని, రానున్న రోజుల్లో మిగిలిన రెండు గ్యారెంటీలను కూడా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉద్దండపురం సత్యనారాయణ, ఓబిసి చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శంకర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ, సురేందర్ పాల్గొన్నారు.

# నేదునూరి మాట

## క్యాన్సర్ నివారణకు అవగాహనే ఆయుధం మనోధైర్యమే మందు

### నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

**కరీంనగర్ /హైదరాబాద్, (ప్రజాస్వరం) :**



ప్రపంచ మానవాళి
క్యాన్సర్ మహమ్మారికి గురై
మృత్యువాత పడుతుంది

చిన్న పెద్ద పేద ధనిక తేడా
లేకుండా క్యాన్సర్ సునామీ
ప్రమాద ఘంటికలు
మోగిస్తుంది
క్యాన్సర్ మనసును శరీరాన్ని
ఆత్మను దెబ్బతీస్తుంది

క్యాన్సర్ సోకిన వ్యక్తికి
ఆర్థికంగా
తట్టుకునే శక్తి యుక్తులను
నేర్పాలి
వ్యాధి నిర్ధారణ చికిత్సపై
అవగాహన పెంచాలి

కుటుంబం సమాజం
వైద్యులు క్యాన్సర్ రోగులకు
ప్రతి దశలో జయిస్తాను అనే
మనోనిబ్బరం కలిగించాలి

సకాలంలో సరైన కౌన్సెలింగ్
తో
రోగి మనసు శరీరం ఆత్మ
కోలుకునే
సలహాలు సూచనలు నేర్పరి
తనం
వున్న వైద్యులే అసలైన
ఆయుధం

రోగిలో చికిత్స అవగాహన
ఆధునిక వైద్య పరిజ్ఞానం
చికిత్సా సామర్థ్యం సమాచార
ప్రసార నైపణ్య ప్రతిభ
సామర్థ్యాలు
వున్న వైద్యుల సేవలతో
క్యాన్సర్ పై పోరాడే ఆత్మబలం
పెంచాలి

వాడుక భాషలో చికిత్స
పద్ధతులను బోధించాలి
క్యాన్సర్ రోగికి సహాను భూతి
కారుణ్య భావనతోవైద్య
సేవలు అందించాలి

పొగాకు మద్యపానం గుట్కా
ఖైనీ ధూమపానం వద్దు
సమతుల ఆహారమే ముద్దు

నిత్య వ్యాయామం యోగ
ధ్యానం సరైన జీవన శైలియే
హద్దు

ప్రకృతి యునాని దేశీయ వైద్య
విధానాలు అందుబాటులోకి
తేవాలి క్యాన్సర్ రోగుల
మనోభావాలను బట్టి
సమయం కేటాయించే వైద్య
సేవల అందుబాటు

2026 సం" క్యాన్సర్ దినోత్సవ
థీమ్ యునైటెడ్ బై యూనిక్
లక్ష్య సాధనకు ఆరోగ్య సేవల
విస్తృతి జీవనశైలిలో మార్పులు
ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి

క్యాన్సర్ రోగుల్లో కుంగుబాటు
దూరమై జీవితంపై ఆశ
చిగురిస్తుంది స్వాంతన
సొంతమై
స్వస్థత చేకూరి కుంగుబాటు
దూరమౌతుంది

క్యాన్సర్ ముందస్తు గుర్తింపే
అసలైన ఆయుధం
మనోనిబ్బరమే క్యాన్సర్
మహమ్మారికి మందు
క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలే
ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

నేదునూరి కనకయ్య
(కళ్యాణ్)
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరమ్
ఫ్రీలాన్స్ రచయిత కాలమిస్ట్
కరీంనగర్
9440245771

# దౌల్తాబాద్ పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీలు

- **విద్యార్థుల సిద్ధతపై ప్రత్యేక దృష్టి**

**దౌల్తాబాద్, జనవరి 3 (ప్రజా స్వరం):**

దౌల్తాబాద్ మండలంలోని పాఠశాలలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని ఉప్పర్‌పల్లి, గువ్వలేగి, గోవిందాపూర్, పోసాన్‌పల్లి, కోనాయిపల్లి, దీపాయంపల్లి, గొడుగుపల్లి, మల్లేశంపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషనల్ లిటరసీ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) జాతీయస్థాయి సర్వేకు సంబంధించి మూడో తరగతి విద్యార్థులను ఏ విధంగా సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. నల్లబల్లపై ఆంగ్లం, గణితం పాఠాలను విద్యార్థులతో చేయించి వారి ప్రతిభను పరీక్షించారు.వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మాదిరి పరీక్షలు నిర్వహించి జాతీయస్థాయి పరీక్షకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. గోవిందాపూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గొడుగుపల్లి పాఠశాలలో విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పఠనాన్ని చేయించారు. ప్రతి పాఠశాలలో ఉదయం 5 గంటలకు ట్యూషన్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు సహకరించాలని తెలిపారు. వివిధ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గజ్జల కనకరాజు, ప్రధానోపాధ్యాయులు రూప్‌సాగర్, రజిత, మాధురి, బాల్‌రెడ్డి, ఉమారాణి, సీఆర్‌పీలు గాడి రాజు, ముత్యం గారి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.





# బాలాజీనగర్‌లో టైగర్ కారింగుల నర్సింగరావు వర్ధంతి

- **నివాళులర్పించిన కుల, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు**

**జవహర్ నగర్, ఫిబ్రవరి 3,(ప్రజాస్వరం) :**

జవహర్ నగర్ వ్యవస్థాపకుడు టైగర్ కారింగుల నర్సింగరావు గౌడ్ 27వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం బాలాజీ నగర్ లోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు,కుల,ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేదలకు నివాస స్థలం ఉండాలని పోరాటంతో గుడిసె వాసులకు అండగా నిలిచి నేడు ఎన్నో లక్షల మందికి ఆవాసం గా నిలిచిన గొప్ప వ్యక్తి జవహర్ నగర్ వ్యవస్థాపకుడు కార్మికుల నర్సింగరావు గౌడ్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ.... గొప్ప వ్యక్తులు ఎప్పుడూ చరిత్రలో స్థిరస్థాయిగా కారింగుల నరసింహారావు గౌడ్ ఇక్కడి ప్రజలందరూ ఎప్పుడు రుణపడి ఉంటారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కారింగుల రాజు గౌడ్,బీఆర్ఎస్ నాయకులు కొండల్ ముదిరాజ్, ప్రసాద్ గౌడ్, సుధాకర్ చారి, కుమ్మరి నరసింహ, నర్ర మహేష్, అహ్మద్ పాషా, సంతోష్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

## జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి

**రామాయంపేట, ఫిబ్రవరి 03 ( ప్రజా స్వరం ) :**

రామయంపేట మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో టిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని గత పది సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తుందని మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. రామయంపేట మున్సిపాలిటీ లోని 12 వార్డులకు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తూ వారికి బీ ఫాం లను అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగుతున్నాయని, సర్పంచ్ ఎన్నికలలో వచ్చిన మెజార్టీ మున్సిపల్ ఎన్నికల్లో కూడా టిఆర్ఎస్ పార్టీకి వస్తుందని తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతామని భయంతోనే కేసీఆర్ పై ఇబ్బంది పెట్టే విధంగా, కష్టపూర్తంగా చర్యలతోనే సిట్ నోటీసులు ఇవ్వడం జరిగిందని కాలేశ్వరం ప్రాజెక్టు కమిషన్ అని ఒకసారి, ఫోన్ టాపింగ్ అని ఒకసారి, రకరకాల కుట్రలతో కేసీఆర్ పైన అబాండం వేసి, కుట్రలు చేయడం జరిగిందని దీంతో ప్రజలలో బిఆర్ఎస్ పార్టీపై కేసీఆర్ పై మరింత అభిమానం పెరిగిందని, మున్సిపల్ ఎన్నికలలో టిఆర్ఎస్ అభ్యర్థులను కూడా కొట్టాలని ఉద్దేశంతో చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్లాన్ తలకిందులుగా మారిందని ఆమె తెలిపారు, మెదక్ జిల్లాలో తూప్రాన్ నర్సాపూర్ రామయంపేట మెదక్ మున్సిపాలిటీలలో కచ్చితంగా టిఆర్ఎస్ జండా ఎగరవేయడం జరుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు, 10 సంవత్సరాల పాలనలో కేసీఆర్ ఫలాలు ప్రజలందరికీ అందించడం జరిగిందని రైతుల బాగు కోసం రైతుబంధు రైతు బీమా వంటి పథకాలతో రైతులను ఆదుకోవడం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం కనీసం రైతులకు రైతు బంధు కూడా వేయలేక పోయిందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి రవీందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పుట్టి యాదగిరి,చౌదరి సుప్రభాత రావ్,గోపరి నర్సింలు, కన్నాపురం కృష్ణ గౌడ్, మర్కు దత్తు, ఐలయ్య, సుభాష్ రాథోడ్, ఉమామహేశ్వర్, గోండస్వామి యాదవ్, మద్దెల రమేష్, రామ్ కి, నరసింహారావు, అబ్దుల్, తో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు







# అడ్మిషన్ పైన విద్యార్థులకు అవగాహన

**మెదక్ ఫిబ్రవరి 03 (ప్రజా స్వరం) :**

మెదక్, రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 అకడమిక్ ఇయర్ అడ్మిషన్ డ్రైవ్ కోసం డిగ్రీ కళాశాల అధ్యపకులు రామాయంపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాల, తెలంగాణ బాలికల సాంఘీక సంక్షేమ జూనియర్ కళాశాల, వివిధ ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ను సందర్శించారు. వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్ కోసం దోస్త్ నోటిఫికేషన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్ల అవ్వాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.ప్రవీణ్ కుమార్, డా .పశుపతి శర్మ, డా. వినోద్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరెయ్యాలి

**మెదక్ ఫిబ్రవరి 03 (ప్రజా స్వరం) :**

మున్సిపల్ ఎన్నికల పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల కో కన్వీనర్, రాజస్థాన్ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షులు అశోక్ పరమాణి, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వాది రంజిత్ మోహన్ మెదక్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెదక్ మున్సిపల్ పీఠం పైన భారతీయ జనతా పార్టీ జెండా ఎగుర వేయాలని వారికి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ ఎంఎల్ఎన్ రెడ్డి, నందా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మెదక్ జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, వార్డు ప్రబారీలు తదితరులు పాల్గొన్నారు.



# ఆడపిల్లల చదువే అసమానతలకు అడ్డుకట్ట



- **అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి**

**వరంగల్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 02, ప్రజాస్వరం**

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి బి. రాజమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ, ఆడపిల్లల చదువే అసమానతలకు అడ్డుకట్ట అని పేర్కొన్నారు. బాలికలు భయాన్ని దాటుకుని ధైర్యంగా తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. బాలికల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాజమణి మాట్లాడుతూ, చదువు ద్వారానే బాలికలు తమ జీవిత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని బాలికల రక్షణ, విద్య కోసం విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెటర్నరీ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ, విద్య, ఆరోగ్యం రెండూ ఉంటేనే జీవితంలో ఎదుగుదల సాధ్యమని అన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డా. సాంబశివరావు మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో లింగ నిష్పత్తి ఇంకా తక్కువగానే ఉందని, బాలికల ఆరోగ్యానికి ప్రభుత్వం ఆర్‌కేఎస్‌కే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు శారీరక వ్యాయామాలు చేయాలని సూచించారు. డీఈవో రంగయ్య నాయుడు మాట్లాడుతూ, బాలికల సమస్యలను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి స్ఫూర్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావానికి లోను కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని విద్యార్థినీలకు సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో మహిళా అధికారుల సంఖ్య అధికంగా ఉండటం గర్వకారణమని, వారిని ఆదర్శంగా తీసుకుని బాలికలు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల రక్షణకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ల పోస్టర్లు విడుదల చేయగా, బేటి బచావో బేటి పడావో ప్రతిజ్ఞ చేయించారు. చదువు, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినీలకు బహుమతులు అందజేశారు. అలాగే ఆడపిల్లలు ఉన్న తల్లులను సన్మానించి, వారి పేర్లపై మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకట్రామిరెడ్డి, ఆర్డీఓ వరంగల్, డీపీఓ కల్పన, వివిధ శాఖల జిల్లా అధికారులు, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.



# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



- **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**తూప్రాన్ ఫిబ్రవరి 3 (ప్రజా స్వరం) :**

తూప్రాన్. రామాయంపేట నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికలను సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 16 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, కమిషనర్ గణేష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రాశేఖర్‌రెడ్డిలతో పాటు పోలింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్రా రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్యానల్ ఇన్స్పెక్షన్

**వరంగల్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 03, ప్రజాస్వరం :**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఈరోజు జిల్లా ప్యానల్ ఇన్స్పెక్షన్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ విధానం, విద్యా రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సవివరంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం పాఠశాల పనితీరుపై ఇన్స్పెక్షన్ టీం సంతృప్తి వ్యక్తం చేస్తూ, పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఉపాధ్యాయులకు మరింత మెరుగైన బోధన కోసం తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ. రామకృష్ణ, ఉపాధ్యాయులు, ఇన్స్పెక్షన్ టీం ఇంచార్జ్ రమేష్ బండారి మరియు ప్యానల్ ఇన్స్పెక్షన్ టీం సభ్యులు పాల్గొన్నారు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999